బ్రెయిన్ స్ట్రోక్.. బీ కేర్‌ఫుల్

- ఆధునిక జీవన శైలితో పెరుగుతున్న బాధితులు
- ముందస్తు అవగాహన అవసరం
- జీజీహెచ్‌లో కార్పొరేట్ వైద్యసేవలు
- నేడు వరల్డ్ స్ట్రోక్ డే



జీజీహెచ్‌లో పక్షవాతంతో చికిత్స పొందుతున్న రోగులు

గుంటూరు మెడికల్: ఆధునిక జీవనశైలి వల్ల బ్రెయిన్‌స్ట్రోక్ (పక్షవాతం) కేసులు ఎక్కువగా నమోదవుతున్నాయి. సకాలంలో వ్యాధిని గుర్తించి చికిత్స అందించని పక్షంలో పక్షవాతంతో ప్రాణాలుపోయే ప్రమాదం ఉందని న్యూరాలజిస్టులు హెచ్చరిస్తున్నారు. పక్షవాతం వచ్చినవారు నాటు వైద్యం జోలికి వెళ్లి ప్రాణాలు పోగొట్టుకోవటం లేదా శాశ్వత అంగవైకల్యానికి గురవుతున్నారు. గుంటూరు జీజీహెచ్‌కు అంకవైకల్యం సర్టిఫికెట్ల కోసం వచ్చేవారిలో 80 శాతం మంది పక్షవాతాన్ని అశ్రద్ధ చేసి మందులు వాడకుండా అంత్రాలు, ఆకు పసరులతో కాలం వెళ్లదీయటం వల్లే దివ్యాంగులుగా మారినట్లు న్యూరాలజీ వైద్యులు వెల్లడిస్తున్నారు. ఈనెల 29న వరల్డ్ స్ట్రోక్ డే సందర్భంగా (ప్రపంచ పక్షవాత నివారణ దినోత్సవం) సాక్షి అందిస్తున్న ప్రత్యేక కథనం

పక్షవాతం అంటే...

పక్షవాతాన్ని వైద్య పరిభాషలో సెరిబ్రో వాస్క్యులర్ యాక్సిడెంట్ అని పిలుస్తారు. ఈజబ్బు సోకినవారిలో శరీరంలో ఏదో ఒకభాగం చచ్చుబడటం సాధరణంగా కనిపిస్తుంది. ఒక భాగం(పక్షం) పడిపోతుంది కనుక పక్షవాతం అని పిలుస్తారు. రక్తనాళాల్లో రక్తం కొంత ఒత్తిడితో ప్రవహిస్తూ ఉంటుంది. రక్తంలోని ఒత్తిడి పెరిగితే కొంత పరిమితి వరకు రక్తనాళాలు ఒత్తిడిని తట్టుకుంటాయి. ఆ ఒత్తిడి బాగా పెరిగితే కొంత రక్తస్రావం జరుగుతుంది. మెదడులో రక్తస్రావం జరిగినా, రక్తం గూడు కట్టినా పక్షవాతం వస్తుంది.

కారణాలు...

మెదడుకి వెళ్లే రక్తనాళం గాని, మెదడులోని రక్తనాళం గాని పూడుకుపోవటం వల్ల రక్తసరఫరా ఆగిపోతే పక్షవాతం వస్తుంది. మెదడులో కణితులు, రక్తపోటు పెరగటం, పొగతాగటం, మద్యపానం వల్ల రక్తనాళాలు దెబ్బతిని పక్షవాతం వస్తుంది. రక్తంలో కొవ్వు పదార్ధాలు (కొలెస్టరాల్)వల్ల, స్థూలకాయం వల్ల వ్యాధి వస్తుంది.

లక్షణాలు...

పక్షవాతం వచ్చినప్పుడు కొందరికి ఒకే వస్తువు రెండుగా కనబడుతుంది. మాట తడబడం, అయోమయంగా మాట్లాడటం, మింగుడు పడకపోవటం, నీరుకూడా సరిగా తాగలేకపోవటం, నీరు తాగబోతే ముక్కు వెంట కొంత బయటకు రావటం, కళ్లు తిరగటం, తల తిరగటం, అకస్మాత్తుగా తీవ్రమైన తలనొప్పి, వాంతులు, నడకలో తూలుడు, చేయి, మూతి ఒకవైపుకు ఒంకరపోవటం, దృష్టి మందగించటం, కాళ్లు చేతులు ఉన్నట్టుండి బలహీన పడటం వంటి లక్షణాలు కనిపిస్తాయి. కొన్ని సందర్భాల్లో రోగి అపస్మారక స్థితి(కోమా)లోకి వెళ్తాడు.

20 శాతం కేసులకు ఆపరేషన్లు తప్పనిసరి...



బ్రెయిన్ స్ట్రోక్ వచ్చిన వారిలో నూటికి 80శాతం మందికి మెడికల్ మేనేజ్‌మెంట్ ద్వారా పక్షవాతం తగ్గిపోతుంది. బ్రెయిన్‌లో రక్తపుగడ్డ పెద్ద సైజులో ఉన్నప్పుడు 20శాతం పక్షవాతం కేసులకు తప్పనిసరిగా ఆపరేషన్ చేస్తేనే రోగి బ్రతికే అవకాశాలు ఉన్నాయి. బ్రెయిన్ స్ట్రోక్ బాధితుడిని గోల్డెన్ అవర్‌లో న్యూరోసర్జన్ వైద్యుడి తీసుకెళ్తే సకాలంలో ఆపరేషన్ చేసి ప్రాణాలు కాపాడతారు. ఆధునిక వైద్య సేవలు నేడు అందుబాటులో ఉన్నాయి.

– డాక్టర్ భవనం హనుమశ్రీనివాసరెడ్డి, న్యూరోసర్జన్, గుంటూరు

ముందస్తు జాగ్రత్తలే మేలు..



కొన్ని సందర్భాల్లో ప్రాణాలు హరించి వేసే పక్షవాతం బారిన పడకుండా ఉండాలంటే ముందస్తుగా తగు జాగ్రత్తలు తీసుకోవాలి. రక్తపోటును, షుగర్ వ్యాధిని అదుపులో పెట్టుకోవాలి. స్మోకింగ్ చేయకూడదు. మద్యం సేవించకూడదు. కొవ్వు పదార్ధాలు ఎక్కువగా తినకూడదు. స్థూలకాయం తగ్గించుకోవాలి. ఒత్తిడికి దూరంగా ఉండాలి. పాలిష్ బియ్యం కాకుండా ముడి బియ్యం తినాలి. రాగులు, సజ్జలు, జొన్నలు లాంటి చిరుధాన్యాలు తీసుకోవాలి. ప్రతిరోజూ యోగా, నడవటం చాలా మంచిది. జీవనశైలిని మార్చుకోవాలి. ఇంట్లో, బయట పొల్యూషన్‌కు దూరంగా ఉండాలి.

– డాక్టర్ పమిడిముక్కల విజయ, న్యూరాలజిస్టుల సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు

జీజీహెచ్‌లో కార్పొరేట్ వైద్యం...



గుంటూరు ప్రభుత్వ సమగ్ర ఆస్పత్రిలో పక్షవాతం వ్యాధిగ్రస్తులకు ప్రత్యేకంగా స్ట్రోక్ యూనిట్‌ను ఏర్పాటుచేసి కార్పొరేట్ వైద్య సేవలను ఉచితంగా అందిస్తున్నాం. 24 గంటలు స్ట్రోక్ యూనిట్‌లో వైద్య సిబ్బంది అందుబాటులో ఉంటారు. మంగళవారం, గురువారం, శనివారం అవుట్‌పేషేంట్ విభాగంలోని 10వ నెంబర్ గదిలో ఈ వైద్య సేవలు లభిస్తున్నాయి. వ్యాధి నిర్ధారణకు అవసరమైన ఎంఆర్ఐ, సిటీ స్కాన్, కలర్ డాప్లర్ వైద్య పరికరాలు ఉన్నాయి . ఆధునిక జీవన శైలి వల్ల ప్రతి ఏడాది కేసులు పెరుగుతూ ఉన్నాయి. ప్రజలు వ్యాధిపట్ల అవగాహన కల్గి ఉండి ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి.

– డాక్టర్ నాగార్జునకొండ వెంకటసుందరాచారి, న్యూరాలజీ విభాగాధిపతి

డిసెంబర్ 9 లోపు అభ్యంతరాలు స్వీకరించాలి



అధికారులతో సమావేశమైన ఇన్‌చార్జి కమిషనర్ శ్రీనివాస్

నెహ్రూనగర్: ఓటర్ల ముసాయిదా జాబితాపై డిసెంబర్ 9వ తేదీలోపు అభ్యంతరాలను తీసుకొని పరిష్కరించాలని బీఎల్‌ఓలను నగరపాలక సంస్థ ఇన్‌చార్జి అదనపు కమిషనర్ సీహెచ్ శ్రీనివాస్ ఆదేశించారు. శనివారం ఆయన చాంబర్‌లో ఎన్నికల విధుల నిర్వహణపై సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలకు అనుగుణంగా ఈ నెల 27వ తేదీకి ఓటర్ల ముసాయిదా జాబితా విడుదలైందని, అందులో వచ్చే అభ్యంతరాలను పరిష్కరించి, తుదిజాబితాతో తప్పులు లేకుండా వచ్చేలా చూడాలన్నారు. సూపర్‌వైజరీ అధికారులు తమ పరిధిలోని బీఎల్‌ఓల వారిగా వచ్చే అభ్యంతరాలను నేరుగా పరిశీలించాలన్నారు. అభ్యంతరాలను ఎన్నికల విభాగంలో బీఎల్వోల వారిగా రికార్డు నమోదు చేయాలని ఆ విభాగం సూపరింటెండెంట్‌ని ఆదేశించారు. ఎన్నికల విధుల్లో ఎంతో అప్రమత్తంగా ఉండాలని, ఎటువంటి నిర్లక్ష్యంగా ఉన్నా కఠిన చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు. నగరంలోని ఓటర్లు నేరుగా తమ ఓటుని సంబంధింత బిఎల్‌ఓ, పోలింగ్ కేంద్రాల్లో పరిశీలించుకోవచ్చని తెలిపారు. సమావేశంలో మేనేజర్ శివన్నారాయణ, సూపరింటెండెంట్‌లు సాంబశివరావు, ప్రసాద్, పద్మ పాల్గొన్నారు.

4న తూర్పులో సామాజిక సాధికార బస్సు యాత్ర

బస్సు యాత్ర పోస్టర్లను ఆవిష్కరించిన ఎమ్మెల్యే ముస్తఫా



బస్సు యాత్ర పోస్టర్లను ఆవిష్కరించిన ఎమ్మెల్యే మహమ్మద్‌ముస్తఫా, నాయకులు నూరిఫాతిమా

నగరంపాలెం: నవంబరు 4వ తేదీన తూర్పు నియోజకవర్గంలో జరగనున్న సామాజిక సాధికార బస్సు యాత్రను జయప్రదం చేయాలని ఎమ్మెల్యే మహమ్మద్ ముస్తఫా, వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ నూరి ఫాతిమా పిలుపునిచ్చారు. యాత్రకు సంబంధించి పోస్టర్లను శనివారం ఎమ్మెల్యే కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు 2019 సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నాలుగున్నరేళ్ల పాలనలో చిత్తశుద్ధితో అమలు చేశామని అన్నారు. 2024 సార్వత్రిక ఎన్నికలలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. నియోజకవర్గంలో జరగనున్న సామాజిక సాధికార యాత్రలో పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. అంజుమన్ ఇస్లామియా కమిటీ అధ్యక్షుడు షేక్ అబ్దుల్ కర్నుమా, డిప్యూటీ మేయర్ బాలవజ్రబాబు, రాష్ట్ర కృష్ణ బలిజ/ పూసల అభివృద్ధి కార్పొరేషన్ చైర్‌పర్సన్ కోలా భవానీ మణికంఠ, కార్పొరేటర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

క్విజ్ పోటీల విజేతలకు బహుమతులు



క్విజ్‌పోటీల్లో విజేతలతో లక్ష్మీనారాయణ, రవి శ్రీనివాస్

పాత గుంటూరు: భారతదేశ సంస్కృతి, సాంప్రదాయాలు, పురాతన సంపదలను పరిరక్షించి భావితరాలకు అందించడమే లక్ష్యంగా ఇంటాక్ సంస్థ పనిచేస్తుందని ఇంటాక్ రాష్ట్ర కో–కన్వీనర్ ఎస్.వి.ఎస్. లక్ష్మీనారాయణ అన్నారు. శనివారం భారతీయ విద్యాభవన్‌లో నిర్వహించిన ఇంటాక్ రాష్ట్రస్థాయి క్విజ్ పోటీలను లక్ష్మీనారాయణ ప్రారంభించి మాట్లాడారు. ఇంటాక్ సంస్థ ద్వారా శిథిలావస్థకు చేరిన అనేక పురాతన కట్టడాలను అభివృద్ధి పరిచి, వాటి చారిత్రక వైభవాన్ని ప్రజలకు వివరిస్తూ, వాటి ఆవశ్యకతలను విద్యార్థులకు తెలియజేస్తున్నామని తెలిపారు. ఎ.రవి శ్రీనివాస్ మాట్లాడుతూ అన్ని జిల్లాలనుంచి విద్యార్థులు క్విజ్ కాంపిటీషన్ పాల్గొని రాష్ట్రస్థాయిలో విజేతలుగా నిలిచిన విద్యార్థులను ఢిల్లీలో నిర్వహించనున్న జాతీయస్థాయి క్విజ్ కాంపిటీషన్స్ పంపనున్నట్లు ఆయన తెలిపారు. ఈసందర్భంగా నిర్వహించిన క్విజ్ పోటీల్లో ప్రథమ బహుమతి విజేతలుగా నిలిచిన విశాఖపట్నం విద్యార్థులు నైతిక్ పవార్, సాయికీర్తనలకు ప్రశంసాపత్రాలు, బహుమతులు అందజేశారు. సంస్థ సభ్యులు అడపా వేణుగోపాల్, కె.వి.బ్రహ్మం, సుబ్రహ్మణ్యం, సీతారమేష్, రాష్ట్రంలోని వివిధ పాఠశాలల నుంచి వచ్చిన విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పల్లెకు పోదాం విజయవంతం చేద్దాం



వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సెక్రటరీలతో మాట్లాడుతున్న ఇన్‌చార్జి కమిషనర్ భాస్కర్

నెహ్రూనగర్: ప్రతివార్డు సచివాలయం పరిధిలో పల్లెకు పోదాం కార్యక్రమం విజయవంతానికి కార్యదర్శులు బాధ్యత తీసుకోవాలని నగరపాలక సంస్థ ఇన్‌చార్జి కమిషనర్ పీవీకే భాస్కర్ అన్నారు. శనివారం నగరపాలక సంస్థ కాన్ఫరెన్స్ హాల్‌లో పల్లెకు పోదాం కార్యక్రమ నిర్వహణపై సచివాలయ కార్యదర్శులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నవంబర్ 9 నుంచి డిసెంబర్ 8 వరకు అన్ని వార్డు, గ్రామ సచివాలయాల్లో పల్లెకు పోదాం అనే కార్యక్రమం అమలు చేస్తుందన్నారు. కార్యక్రమంలో భాగంగా ప్రతి రోజు మధ్యాహ్నం 3 నుంచి 4 గంటల వరకు సచివాలయాల్లో ఇప్పటివరకు అమలు చేసిన సంక్షేమ పథకాలు, లబ్ధిదారులు, రానున్న పథకాలను స్థానిక ప్రజా ప్రతినిధుల భాగస్వామ్యంతో ప్రజలకు తెలియజేయాలన్నారు. సచివాలయం పరిధిలోని లబ్ధిదారుల వివరాలతో కూడిన డిస్ ప్లే బోర్డ్స్ పథకాల వారీగా ఏర్పాటు చేయాలన్నారు. పల్లెకు పోదాం కార్యక్రమం ద్వారా ప్రభుత్వ పథకాలు అర్హత ఉండి ఇంకా ఎవరికైనా అందకుండా ఉంటే వారికి వెంటనే అందించేందుకు దోహదపడుతుందని, కార్యదర్శులు, వలంటీర్లు కార్యకమం గూర్చి స్థానిక ప్రజలకు తెలియచేయాలని, విధుల్లో నిర్లక్ష్యంగా ఉండే వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఇప్పటికే సచివాలయాల వారిగా నోడల్, సూపర్వైజరీ అధికారులను నియమించామన్నారు. ఇన్‌చార్జి అదనపు కమిషనర్ సీహెచ్ శ్రీనివాస్, డెప్యూటీ కమిషనర్లు బి.శ్రీనివాసరావు, టి.వెంకటకృష్ణయ్య, మేనేజర్ శివన్నారాయణ, సూపరింటెండెంట్ ప్రసాద్ పాల్గొనారు.

అంధత్వ నివారణకు బజరంగ్ ఫౌండేషన్ కృషి

- సీఎం వైఎస్ జగన్ స్ఫూర్తిగా సేవాకార్యక్రమాలు
- బజరంగ్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు అంబటి మురళీకృష్ణ
- మంచాలలో 361 మందికి కళ్లజోళ్లు అందజేత



దివ్యాంగుడికి కళ్లజోడు పెడుతున్న బజరంగ్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు అంబటి మురళీకృష్ణ

చేబ్రోలు: చేబ్రోలు మండలం మంచాల గ్రామంలో బజరంగ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కళ్లజోళ్ల పంపిణీ కార్యక్రమాన్ని వ్యవస్థాపకులు అంబటి మురళీకృష్ణ శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో మురళీకృష్ణ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలో అంధత్వ సమస్య నివారణకు బజరంగ్ ఫౌండేషన్ కృషి చేస్తోందన్నారు. బజరంగ్ జగన్నామ సంక్షేమ సంవత్సరంలో భాగంగా నేత్ర జ్యోతి పేరుతో వైద్య శిబిరాలను నిర్వహిస్తోన్నట్టు పేర్కొన్నారు. ఉచిత నేత్ర వైద్య శిబిరాల అనంతరం వైద్య సేవలను కొనసాగిస్తున్నట్టు తెలిపారు. జగనన్న సంక్షేమ పాలనను ఆదర్శంగా తీసుకుని కుల, మత, వర్గ, వర్ణ, రాజకీయాలకు అతీతంగా ఈ సేవా కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతోందన్నారు. వైద్యశిబిరంలో మంచాల, శ్రీరంగపురం, తోట్లపాలెం గ్రామాలకు చెందిన 423 మంది నేత్ర పరీక్షలు చేయించుకోగా, సమస్య ఉన్నట్లు గుర్తించిన వారందరికీ కేవలం 6 రోజుల్లోనే, మొత్తం 361మందికి కళ్ళజోళ్లను అందించడం జరిగిందన్నారు. వివిధ గ్రామాల్లో నిర్వహించిన నేత్ర జ్యోతి శిబిరానికి అనూహ్య రీతిలో స్పందన లభిస్తోందని, ఇప్పటివరకు సుమారు 9,139 మందికి నేత్ర వైద్య పరీక్షలు నిర్వహించి, 6,865 మందికి కళ్లజోళ్లు అందించడం జరిగిందని అంబటి మురళీకృష్ణ వివరించారు. అనంతరం ఆయా గ్రామాల ప్రజలు ముఖ్యమంత్రి జగనన్నకు ధన్యవాదాలు చెబుతూ, జగనన్న చిత్రపటాలను ప్రదర్శించారు.

టీడీపీ నాయకులపై కేసు నమోదు

గుంటూరు ఈస్ట్: పోలీసుల అనుమతి లేకుండా నిరసన ప్రదర్శన చేపట్టిన టీడీపీ నేతలు, కార్యకర్తలపై అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం నగర టీడీపీ నాయకుల ఆధ్వర్యంలో లాడ్జిసెంటర్‌లో సంఘీభావ ప్రదర్శన శనివారం చేపట్టారు. ప్రదర్శనకు పోలీసుల అనుమతులు లేకుండా టీడీపీ నేతలు, కార్యకర్తలు నిరసన చేస్తున్న వారిని పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌ఓ రామానాయక్ చెప్పారు.

ఘనంగా వాల్మీకి జయంతి వేడుకలు



చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఏఎస్పీలు

గుంటూరు ఎడ్యుకేషన్: అరండల్‌పేటలోని జిల్లా కేంద్ర గ్రంథాలయంలో శనివారం వాల్మీకి జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వాల్మీకి మహర్షి చిత్రపటానికి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ దేవానంద్ పూలమాల వేసి నివాళులర్పించారు. జిల్లా గ్రంథాలయసంస్థ కార్యదర్శి కె.ఝాన్సీలక్ష్మి, గ్రంథ పాలకుడు కె.చిన్నపరెడ్డి, ఎన్.నాగిరెడ్డి పాల్గొన్నారు. ఏసీ కళాశాల ఎదుట ఉన్న ప్రభుత్వ ప్రాంతీయ గ్రంథాలయంలో వాల్మీకి జయంతి వేడుకలు జరిగాయి.

జిల్లా పోలీస్ కార్యాలయ ఆవరణలో..

నగరంపాలెం: జిల్లా పోలీస్ కార్యాలయ (డీపీఓ) ఆవరణలో శనివారం మహర్షి వాల్మీకి జయంతి వేడుకలు నిర్వహించగా, ఆయన చిత్రపటానికి ఏఎస్పీలు కె.కోటేశ్వరరావు(ఏఆర్), ఎ.శ్రీనివాసరావు(క్రైం)లు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆర్ఐలు థామస్‌రెడ్డి, రమేష్ కృష్ణన్, రాజారావు, రాఘవయ్య, పోలీస్ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

పోలీసు సిబ్బంది రక్తదానం

నగరంపాలెం: ప్రతి ఒక్కరూ రక్తదానం చేసి, ప్రాణపాయ స్థితిలో ఉన్నవారిని కాపాడాలని జిల్లా ఏఎస్పీలు ఎ.శ్రీనివాసరావు (క్రైం), కె.కోటేశ్వరరావు (ఏఆర్) పిలుపునిచ్చారు. పోలీస్ అమరవీరుల సంస్మరణ ఉత్సవాల్లో భాగంగా శనివారం లలితా సూపర్ స్పెషాలిటీ హాస్పటల్, గుంటూరు జీజీహెచ్ వైద్యుల బృందం, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ సంయుక్తంగా పోలీస్ పెరేడ్ గ్రౌండ్స్‌లో మెగా ఉచిత వైద్య/ రక్తదాన శిబిరం నిర్వహించారు. పోలీస్ అధికారులు, సిబ్బంది, వారి కుటుంబ సభ్యులకు వైద్యసేవలు అందించారు. అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. అదే విధంగా పోలీస్ అధికార, సిబ్బంది, ఆటోడ్రైవర్లు రక్తదానం చేశారు. రక్తదానం చేసిన వారికి పండ్లు, జ్యూస్ అందజేసి, సర్టిఫికెట్‌లను ఏఎస్పీలు అందజేశారు. ఏఆర్ డీఎస్పీ చంద్రశేఖర్‌రావు, వైద్యులు ఫణిరాజు, సమన్వయకర్త రత్నకిషోర్, ఆర్ఐలు థామస్‌రెడ్డి, రాజారావు, రమేష్‌కృష్ణన్, రాఘవయ్య, ఆర్ఎస్ఐలు, జీజీహెచ్ వైద్యులు, నర్సులు, డిప్యూటీ ఉపాధ్యక్షుడు వీఎస్.శ్రీధర్‌రావు, హెచ్‌డీఎఫ్‌సీ డబ్ల్యూ మేనేజర్ ఎన్.రమణచంద్రరావు, బీఎం జి.రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

సురక్ష శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

నగరంపాలెం: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న జగనన్న ఆరోగ్య సురక్షను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకుంటున్నారని వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి నూరిఫాతిమా అన్నారు. శనివారం 7, 14 డివిజన్లల్లో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలను ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పేద ప్రజలకు కనీస అవసరాలను తీర్చడంలో ప్రభుత్వం ముందు వరుసలో ఉంటుందని అన్నారు. స్థానిక కార్పొరేటర్లు వేముల జ్యోతి, శ్రీనివాస్, అజయ్, అంజలీ సత్యం, జీఎంసీ, సచివాలయ సిబ్బంది, అంగన్‌వాడీ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

దేశ సమగ్రతకు దోహదం చేసే నా మట్టి-నా దేశం



గుంటూరు ఎడ్యుకేషన్: నా మట్టి – నా దేశం కార్యక్రమం మన ఐక్యత, సమగ్రతలను బలోపేతం చేస్తుందని జిల్లా పరిషత్ సీఈఓ జె.మోహనరావు అన్నారు. మేరీ మట్టి–మేరా దేశ్ కార్యక్రమంలో భాగంగా ఈనెల 30, 31వ తేదీల్లో ఢిల్లీలోని కర్తవ్యపథ్‌లో నిర్వహించే అమృత్ కలశ యాత్రకు గుంటూరు, బాపట్ల, పల్నాడుజిల్లాల నుంచి 53 మంది యువతీ, యువకులు బయలుదేరి వెళ్లారు. శనివారం గుంటూరు నుంచి బస్సు ద్వారా బయలుదేరి విజయవాడ రైల్వే స్టేషన్ నుంచి దేశ రాజధాని ఢిల్లీకి వెళ్లారు. గుంటూరు నెహ్రూ యువ కేంద్రం, జిల్లా యంత్రాంగం సహకారంతో మండలానికి ఒకరు చొప్పున మండల ప్రతినిధులుగా యువత సేకరించిన మట్టి, బియ్యాన్ని అమృత కలశాల్లో నింపి వాటిని తీసుకుని బయలుదేరారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో నెహ్రూ యువకేంద్రం జిల్లా యువ అధికారి కిరణ్మయి దేవిరెడ్డి, స్టెప్ సీఈఓ పల్లవి పాల్గొన్నారు.

10న వైద్యుల దీపావళి వేడుకలు



గుంటూరు మెడికల్: ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) ఆధ్వర్యంలో నవంబరు 10న గుంటూరు శ్రీ కన్వెన్షన్‌లో దివాళి సాంస్కృతిక వేడుకలు నిర్వహిస్తున్నట్లు ఐఎంఏ కార్యదర్శి డాక్టర్ బూసిరెడ్డి నరేంద్రరెడ్డి అన్నారు. శనివారం సాంస్కృతిక వేడుకల పోస్టర్‌లను జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్ ఆవిష్కరించారు. ఈసందర్భంగా డాక్టర్ నరేంద్రరెడ్డి మాట్లాడుతూ వైద్యుల్లో వృత్తిపరమైన ఒత్తిడిని దూరం చేసేందుకు కుటుంబ సభ్యులతో కలిసి సంతోషంగా గడిపేందుకు దివాళి నిర్వహిస్తున్నట్లు డాక్టర్ నరేంద్రరెడ్డి తెలిపారు. పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో ఆర్థోపెడిక్ ప్రొఫెసర్ డాక్టర్ అనిల్‌బాబు, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాస ప్రసాద్‌పాల్గొన్నారు.

శారీరక దృఢత్వంతో ఆరోగ్య సమాజం

గుంటూరు ఎడ్యుకేషన్: శారీరకంగా దృఢంగా ఉన్నప్పుడే సరైన, ఆరోగ్యకరమైన ఆలోచనా విధానం ఏర్పడుతుందని ఆస్టర్ రమేష్ హాస్పిటల్స్ న్యూట్రిషినిస్ట్ నాగలక్ష్మి పేర్కొన్నారు. శనివారం అమరావతిరోడ్డులోని హిందూ మేనేజ్‌మెంట్ కళాశాలలో హాస్పిటల్ మేనేజ్‌మెంట్ విభాగ ఆధ్వర్యంలో ఆస్టర్ రమేష్ హాస్పిటల్స్ వైద్యులు, ఆరోగ్య నిపుణులతో సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా నాగలక్ష్మి మాట్లాడుతూ శరీర ఆరోగ్యాన్ని సమతుల్యంగా ఉంచుకోవడం ద్వారా వ్యక్తి అభివృద్ధితో పాటు ఆరోగ్యకర సమాజాభివృద్ధికి దోహదం చేస్తుందన్నారు. గైనకాలజిస్ట్ డాక్టర్ అనిత మాట్లాడుతూ ఆధునిక జీవన విధానంతో విద్యార్థినులకు రక్తహీనత, రుతుస్రావంలో మార్పులు సంభవించి కణుతుల, క్యాన్సర్ వంటి వ్యాధులు ప్రబలిస్తున్నాయని వివరించారు. ఈసందర్భంగా ఇరువురిని కళాశాల యాజమాన్యం సత్కరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్వీ రమణ, ఎంబీఏ విభాగాధిపతి వి. చక్రవర్తి, ప్రొఫెసర్ డాక్టర్ కె. లలిత, సహాయాచార్యులు పాల్గొన్నారు.

వేధింపుల భర్త, అత్త మామలపై కేసు

గుంటూరు ఈస్ట్: వివాహితను భర్త, అత్తమామలు, ఇతర కుటుంబ సభ్యులు దూషించి బెదిరించిన ఘటనపై నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గోరంట్లకు చెందిన వాసంతి. ఒంగోలుకు చెందిన ఫణి దంపతుల మధ్య విభేదాలు వచ్చాయి. వాసంతి భర్త, అత్తమామ, ఇతర కుటుంబ సభ్యులపై ఫిర్యాదు చేసింది. ఈనెల 26న ఇరు కుటుంబ సభ్యులు దిశ పోలీసు స్టేషన్‌లో హాజరయ్యారు. అనంతరం బయటకు వచ్చిన తరువాత అరవింద ఫణి, అతని తల్లిదండ్రులు, బంధువులు వాసంతిని బెదిరించి దుర్భాషలాడారు. శనివారం వాసంతి పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గుడిలో చోరీ ఘటనపై..

గుడిలో పూజారిని మోసం చేసి సీతమ్మవారి మంగళసూత్రాలు గుర్తుతెలియని వ్యక్తి చోరీ చేసిన ఘటనపై లాలాపేట పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం సంపత్‌నగర్‌లోని రామాలయం మందిరానికి ఈనెల 26న భక్తుడుగా ఓ వ్యక్తి వచ్చాడు. పూజలు పూర్తయిన అనంతరం పూజారికి రూ. 500 నోటు ఇచ్చి రూ. 100 తీసుకుని రూ. 400 తిరిగి ఇవ్వాలని కోరాడు. పూజారి సత్యమోహనరావు చిల్లర తీసుకొచ్చేందుకు గుడి నుంచి బయటకు వెళ్లాడు. ఇంతలో ఆ వ్యక్తి సీతమ్మవారి మెడలోని పది గ్రాముల రెండు మంగళసూత్రాలు తెంచుకుని పరారయ్యాడు. సత్యమోహన్‌రావు శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

250 మంది మందుబాబులపై..

నగరంపాలెం: బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగవద్దని జిల్లా ఏఎస్పీ (పరిపాలన) కె.సుప్రజ సూచించారు. గుంటూరు రేంజ్ ఐజీ జి.పాలరాజు ఆదేశాల మేరకు శనివారం గుంటూరు నగరంలోని బహిరంగ ప్రదేశాలలో మద్యం తాగే వారికి జిల్లా పోలీస్ కార్యాలయ (డీపీఓ) ఆవరణలో కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఎస్పీ మాట్లాడుతూ మద్యం మత్తులో వాహనాలు నడిపితే ప్రమాదాలు జరిగేందుకు అవకాశాలు ఉన్నాయని అన్నారు. తద్వారా ప్రమాదాలకు గురైన ఇరువురి కుటుంబాలకు నష్టం జరిగే అవకాశం ఉందన్నారు. ఈ క్రమంలో 250 మందిపై పలు పోలీస్‌స్టేషన్ల పరిధిలో కేసులు నమోదు చేశారు.

మన ఆరోగ్యం మన చేతుల్లోనే..



గుంటూరు మెడికల్: మన ఆరోగ్యం మనచేతుల్లోనే ఉందని, జీవన విధానంలో తగిన మార్పులు చేసుకుంటే పక్షవాతం బారిన పడకుండా జాగ్రత్త పడొచ్చని నగరంలోని పలువురు ప్రముఖ న్యూరాలజిస్టులు పేర్కొన్నారు. ప్రపంచ పక్షవాత దినం సందర్భంగా ప్రజారోగ్య వేదిక ఆధ్వర్యంలో న్యూరో సైంటిస్ట్ అసోసియేషన్ సహకారంతో స్థానిక బ్రాడీపేటలోని గుర్రం జాషువా విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో శనివారం స్ట్రోక్ అవగాహన కార్యక్రం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నగరంలో ప్రముఖ న్యూరాలజిస్టులు డాక్టర్ రమాతారక్ నాథ్, డాక్టర్ పమిడిముక్కల విజయ, డాక్టర్ అరుణకుమారి, డాక్టర్ సి.హెచ్.శివరామకృష్ణయ్య, డాక్టర్ వందనపు నవీన్ తదితరులు పాల్గొన్నారు. ఎమ్మెల్సీ కె.ఎస్.లక్ష్మణరావు ప్రత్యేక అతిథిగా పాల్గొని ప్రసంగించారు. తొలుత స్ట్రోక్‌కు దారి తీసే ప్రమాద కారకాలపై ఉచిత ప్రాథమిక పరీక్షలు నిర్వహించారు. ప్రజలు పెద్ద సంఖ్యలో వచ్చి పరీక్షలు చేయించుకున్నారు. అనంతరం ప్రజారోగ్య వేదిక నాయకులు పి.ఎస్.శేఖర్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన సదస్సులో డాక్టర్ రమాతారక్‌నాథ్, డాక్టర్ పి.విజయలు మాట్లాడారు. ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ వైద్యం ఖరీదైన ఈ తరుణంలో నగరంలోని ప్రముఖ న్యూరాలజిస్టులు స్ట్రోక్‌పై అవగాహన కార్యక్రమంలో, పరీక్షలు నిర్వహించటం అభినందనీయమని పేర్కొన్నారు. కారక్రమాన్ని ప్రజారోగ్య వేదిక నాయకులు ఎల్.ఎస్.భారవి, షేక్.సలీం తదితరులు పర్యవేక్షించారు.

దర్గా ప్రహరీ నిర్మాణ పనులు వేగవంతం చేయాలి



లక్ష్మీపురం: స్థానిక ఏటుకూరు రోడ్డులోని మూడు బొమ్మల సెంటర్ వద్ద సుప్రసిద్ధ హజరత్ సయ్యద్ మీరా షహీద్ అవులియా బాబా దర్గాలో ప్రహరీ గోడ నిర్మాణ పనులను వేగవంతం చేయాల్సిందిగా సంబంధిత దర్గా నిర్వాహకులను జిల్లా వక్ఫ్‌బోర్డు ఇన్‌స్పెక్టర్ ముక్తార్ బాషా సూచించారు. శనివారం ఆయన దర్గా ప్రహరీ గోడనిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులతో మాట్లాడుతూ దర్గాలో భక్తులకు అన్ని విధాల సదుపాయాలను కల్పించాల్సిన బాధ్యత సంబంధిత దర్గా ముతవల్లి పై ఉందన్నారు. దర్గా ముతవల్లి షేక్ కాలేషా, మీరా తదితరులు ఉన్నారు.